క్లుప్తంగా

కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఐ జనార్ధననాయుడు

అమరాపురం: మండలంలోని రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లకు ఎస్‌ఐ జనార్ధన నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీన హిందూపురంలోని బిట్ కళాశాలలో మడకశిర ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థుల తరఫున కౌంటింగ్ ఏజెంట్లుగా వెళ్లే వారు ఎలాంటి నియమ నిబంధనలు పాటించాలి? వారి బాధ్యతలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐతో పాటు ఏఎస్‌ఐ రామంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



సంపత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: ఇటీవల దారుణ హత్యకు గురైన ఎస్‌ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి సంపత్ కుమార్ కుటుంబ సభ్యులను ఆదివారం ఆబాద్‌పేటలోని వారి స్వగృహంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, సీపీఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సంపత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య మాట్లాడుతూ సంపత్‌కుమార్ హత్యతో సంబంధం ఉన్న వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేవరకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఐ నాయకులు బాబు, చలపతి, జబీవుల్లా, చౌకూరు రవికుమార్, సమీఉల్లా, కమల్ బాషా, జియా, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు

- పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



పోలింగ్ గదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సంతోష్‌కుమార్

పావగడ: స్థానిక ఆగ్నేయ ఉపాధ్యాయుల విధాన పరిషత్ ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. ఇందులో భాగంగానే తహసీల్దార్ సంతోష్‌కుమార్ ఆదివారం మాట్లాడుతూ తాలూకా కార్యాలయంలో పోలింగ్ సులభతరంగా ఉండడానికి రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. న్యాయాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 400 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకోవచ్చన్నారు. అలాగే గ్రేడ్- 2 తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 403 మంది ఓటర్లు ఓటు వేయవచ్చని వెల్లడించారు. మొత్తం ఓటర్లు 803 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఓటర్లందరికీ ఓటరు చీటీలు అందించామన్నారు. ఓటు హక్కు వినియోగించుకునే వారు తప్పనిసరిగా ఓటరు చీటీలు తీసుకురావాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని సూచించారు.

భూసార పరీక్ష ... అన్నదాతకు రక్ష

- మండలానికి 300 చొప్పున భూసార పరీక్షలు
- ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయశాఖ



పొలంలో పశువుల ఎరువు తోలిన దృశ్యం

మడకశిరరూరల్: గత రబీలో పంట దిగుబడులు బాగా రావడంతో పాటు మద్దతు ధర లభించడంతో ఈ ఏడాది ఖరీఫ్ పంట సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పంట సాగుకు రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం గ్రామస్థాయిలో ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచింది. దీంతో రైతులు భూములను దున్ని దుక్కి చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులు ఆర్బీకే పరిధిలోని గుర్తించిన రైతు పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు.

ప్రతి మండలం నుంచి 300 పరీక్షలు

మడకశిర వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని మడకశిర, అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం మండలాల్లో ప్రతి మండలం నుంచి 300 చొప్పున 1500 భూసార పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే రైతుల పొలాల్లో సర్వే నంబర్లు గుర్తించారు. ఆర్బీకేల ద్వారా భూసార మట్టి నమూనాలు సేకరించి వాటిని పరీక్షించి ఫలితాలను రైతులకు తెలియజేసి అందుకు అనుగుణంగా పంటలను సాగుకు ప్రోత్సహించనున్నారు. భూసారాన్ని పెంచి పంటకు మంచి పోషకాలు లభించేలా కృషి చేయనున్నారు. మట్టి పరీక్షలతో పంటకు సరైన బలాన్ని అందించి మంచి దిగుబడులు సాధించే దిశగా రైతులను చైతన్య పరుస్తారు. భూసార పరీక్షలు నిర్వహించడం ద్వారా పంటకు తెగుళ్ల వ్యాప్తి తగ్గి మంచి దిగుబడులు సాధించవచ్చు. అదే విధంగా పంట మార్పిడి వల్ల కలిగే లాభాలను రైతులకు వివరిస్తామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

పశువుల ఎరువుతో మరింత భూసారం

పశువుల ఎరువులు ఉపయోగించడం ద్వారా భూమిలో మరింతగా భూసారం పెరిగి పంటలో ఆశాజనకంగా దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో పాడి పశువుల సంఖ్య అధికంగా పెరగడంతో రైతులు పశువుల ఎరువును విక్రయించకుండా పంట సాగు చేసే పొలానికి ఉపయోగిస్తున్నారు. 80 శాతం మంది రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ పంటలను సాగు చేస్తున్నారు. ఖరీఫ్ పంట సాగును మరింత సమర్థవంతగా నిర్వహించేందుకు భూసార పరీక్షలు నిర్వహించి గ్రామ స్థాయిలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టారు. ఇప్పటికే రాయితీ విత్తన వేరుశనగ ఆర్బీకేల ద్వారా పంపిణీ చేస్తున్నారు.

సేంద్రియ ఎరువులే మేలు



పంటల సాగుకు రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిడి తగ్గించి పశువులు, గొర్రెల ఎరువులను పంటకు ఉపయోగిస్తున్నాను. దీని వల్ల పంట దిగుబడితో పాటు తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుంది. భూమి సారవంతంగా ఉంటుంది. ఆర్బీకే సిబ్బంది అవగాహన కల్పించడంతో ఖరీఫ్, రబీలో పంటల సాగుకు సేంద్రియ ఎరువులను అధికంగా ఉపయోగించి పంటలో మంచి దిగుబడులు పొందుతున్నాను. ఖర్చు కూడా తగ్గడంతో ఎక్కువ ఆదాయం పొందగలుగుతున్నాను.

– రవికుమార్, రైతు ,తురుకువాండ్లపల్లి

అధిక దిగుబడులు సాధ్యం



సేంద్రియ ఎరువు వాడకంతో భూమి సారవంతం అవుతుంది. గత నాలుగు సంవత్సరాలుగా నేను రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుతో పంటలను సాగు చేస్తున్నారు. దీని ద్వారా మంచి దిగుబడులు పొందుతున్నాను. పశువుల ఎరువు భూమిలో చల్లుకోవడంతో భూమి మరింతగా సారవంతమై మంచి దిగుబడులు వస్తాయి. అందరూ రసాయన మందులను తగ్గించి సేంద్రియం వైపు మొగ్గు చూపితే బాగుంటుంది.

– శ్రీరామరెడ్డి, రైతు, ఎల్లోటి

శుభకార్యం



వధూవరూలను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

అమరాపురం: మండల పరిధిలోని బసవనపల్లిలో ఆదివారం ఉదయం వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహప్ప కుమార్తె శ్వేత, శశికుమార్ వివాహం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పెళ్లికి హాజరైన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, ఉప్పార్లపల్లి శివకుమార్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్య ప్రజలతో మాటామంతీ

మండలంలోని బసవనపల్లి గ్రామంలో ఆదివారం సామాన్య ప్రజలతో కలసి ఓ టీ కొట్టులో మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప తేనేటీ విందును సేవించారు. బసవనపల్లికి వచ్చిన ఆయన గుడిబండ గ్రామానికి వెళుతూ దారిలో కనబడిన వారితో మాట్లాడారు. మంగళవారం ఎన్నికల కౌంటింగ్ ఉందని, మీ గ్రామంలో ఏవిధంగా పోలింగ్ జరిగింది? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నేడు విత్తన వేరుశనగ పంపిణీ

రొద్దం: విత్తన వేరుశనగ కోసం ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు సోమవారం రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు వీఏఏ రఘునాథ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నారనాగేపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యవసాయ పనుల్లో అన్నదాతలు



హరేసముద్రంలో వేరుశనగ విత్తనాలను సిద్ధం చేసుకొంటున్న దృశ్యం



గొడనహళ్లి వద్ద పొలాన్ని ట్రాక్టర్ ద్వారా దున్నుతున్న రైతు

మడకశిరరూరల్: నియోజకవర్గంలో శనివారం రాత్రి మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల్లో 37.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది మే నెల నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతులు ముందస్తు ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాలను కాడెద్దులు, ట్రాక్టర్ ద్వారా దున్నుకున్ని దుక్కి చేసుకుంటున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తుండడంతో వేరుశనగ కాయలను తీసుకొని విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు.

అధికారం మళ్లీ వైఎస్సార్‌సీపీదే

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



దొడ్డేరిలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రొళ్ల: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోనికి వచ్చి రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని పిల్లిగుండ్ల, దొడ్డేరి గ్రామాల్లో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగేగౌడుతో కలిసి పర్యటించారు. గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిపై 32 పోలింగ్ కేంద్రాల వారీగా వైఎస్సార్‌సీపీకి వచ్చే మెజార్టీని అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను నాయకులు సాదరంగా ఆహ్వానించి పూలమాల వేసి శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడుతూ దేశవ్యాప్తంగా శనివారం సాయంత్రం విడుదల చేసిన ఎగ్జిట్ పోల్ సర్వేలో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకే అధిక సీట్లు వస్తాయని తేల్చి చెప్పాయని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఒంటరిగా జగన్‌ను ఎదుర్కొనే దమ్ములేకనే టీడీపీ అధినేత చంద్రబాబు బీజేపీ, జనసేనతో జత కట్టారని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వారు చెప్పిన బూటకపు హామీలను నమ్మకుండా వైఎస్సార్‌సీపీకే ప్రజలు మద్దతు ఇచ్చారని చెప్పారు.

వైఎస్సార్‌సీపీకి 160 స్థానాలు

మడకశిర నియోజకవర్గంలో తనతో పాటు హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి పోటీలో ఉన్న శాంతమ్మ కూడా అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారని ఈరలక్కప్ప ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం అందుతున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు తిరిగి యథావిధిగా కొనసాగాలంటే రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిందేనన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన కూడా ప్రజలు మాత్రం వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపారని , సీఎం వైఎస్ జగన్ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాభిమానంతో మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి సార్వత్రిక ఎన్నికల్లో మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. 160 అసెంబ్లీ స్థానాలు, 19 పైగా ఎంపీ స్థానాలతో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని తెలిపారు. అనంతరం రొళ్ల పట్టణంలో బోర్‌వెల్ ఏజెన్సీ శ్రీరామప్ప ఇంట్లో జరిగిన విందులో నాయకులతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భర్త విజయరంగేగౌడు, నాయకులు హెక్బల్‌భాషా, నూరుల్లాబాషా, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2001–2004 సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో పని చేసిన అధ్యాపక బృందాన్ని ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరించారు. విద్యాభివృద్ధికి వారు చేసిన కృషిని ప్రశంసించారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు డాక్టర్ జయప్ప, సీతారామయ్య, హరీష్‌బాబు, రామన్న, అశ్వర్థప్ప తదితరులు పాల్గొన్నారు.

పోతలయ్యస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న పోతలయ్యస్వామి

కనగానపల్లి: మండలంలోని దాదులూరులో పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పోతలయ్య, చెన్నేకేశవ స్వాములను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు

- ముగిసిన టేబుల్ టెన్నిస్, చెస్ శిక్షణ తరగతులు



క్రీడాకారులకు మెడల్స్ అందిస్తున్న కళాజ్యోతి కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని సీనియర్ చెస్ క్రీడాకారులు రామకృష్ణ, పీడీ రమేష్, జగ్గా వేణుగోపాల్, కళాజ్యోతి కమిటీ అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి రామకృష్ణ సూచించారు. స్థానిక కళాజ్యోతిలో ఆదివారం సాయంత్రం వేసవి టేబుల్ టెన్నిస్, చెస్ శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడాకారులకు మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతనెల 25 నుంచి ఈనెల 2వతేదీ వరకు 35 రోజులపాటు ఉచితంగా టేబుల్ టెన్నిస్, చెస్, క్యూబ్ సాల్వింగ్ వేసవి శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. టేబుల్ టెన్నిస్ శిక్షకుడు నాగేంద్ర, చెస్ శిక్షకుడు శివకృష్ణ, క్యూబ్ సాల్వింగ్ శిక్షకుడు కిషోర్‌కుమార్‌లు విద్యార్థులను క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దారని తెలిపారు. టేబుల్ టెన్నిస్‌లో 60 మంది, చెస్‌లో 200, క్యూబ్ సాల్వింగ్ శిక్షణలో 60 మంది విద్యార్థులు శిక్షణపొందారన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, శిక్షకులు పాల్గొన్నారు.

కార్తికేయునికి విశేష పూజలు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో ఉన్న సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూల విరాట్‌కు బంగారు ఆబరణాలతో పాటు, పట్టు వస్త్రాలు ధరింప చేసి ఆకుపూజ, విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహించారు.

వర్షం.. అంతటా హర్షం



హిందూపురం: చెట్టు పడటంతో ధ్వంసమైన ఆటో



చిన్నపరెడ్డిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ ప్రహరీ కూలిన దృశ్యం



పెనుకొండ మండలం గుట్టూరులో కూలిన వేప చెట్టు

పెనుకొండ రూరల్: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి వాన దంచికొట్టింది. 40 మిల్లీమీటర్లుగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలియజేశారు. మండలంలోని చంద్రగిరి, దుద్దేబండ, కురుబవాండ్లపల్లి, గుట్టూరు, మునిమడుగు తదితర గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసింది. భారీగ వీచిన గాలులకు, గుట్టూరు గ్రామంలో వేపచెట్టు విరిగి కొమ్మలు విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అలాగే మునిమడుగు గ్రామానికి వెళ్లే రహదారిలో కూడా చింత చెట్లు నేల కూలాయి. మునిమడుగు పంచాయతీ చిన్నపరెడ్డిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ ప్రహరీ నేలకూలింది. వ్యవసాయ పనులకు సరిపడా వర్షం కురవడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధ్వంసమైన ఆటో

హిందూపురం: హిందూపురం పరిసరాల్లో శనివారం రాత్రి కురిసిన గాలివానకు పలుచోట్ల చెట్లు, రేకుల షెడ్లు దెబ్బతిన్నాయి. తూముకుంట చెక్ పోస్ట్ దగ్గర ఈదురు గాలులకు చింతచెట్టు విరిగి ఓ ఆటోపై పడింది. దీంతో ఆటో ధ్వంసమైంది. తన జీవనాధారమైన ఆటోపై చెట్టు పడటంతో వాహనం ధ్వంసమైందని, ఇకపై ఎలా బతకాలని ఆటో డ్రైవర్ హనుమంతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

రొళ్లలో 10.4 మి.మీటర్లు

రొళ్ల: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి కురిసిన వర్షానికి 10.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ తెలిపారు. రైతులు విత్తన వేరుశనగ కోసం నేలను దున్నుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. వ్యవసాయశాఖాధికారుల సూచనల మేరకు విత్తన శుద్ధి చేసిన తర్వాత, తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రమే విత్తు కొంటే సక్రమంగా విత్తనాలు మొలకెత్తేందుకు వీలుంటుదన్నారు. ప్రస్తుతం వ్యవసాయశాఖ ద్వారా రాయితీతో విత్తన కాయలను సరఫరా చేస్తున్నామన్నారు.

లేపాక్షిలో 8.2 మి.మీటర్లు...

లేపాక్షి: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షం 8.2 మి.మీటర్లుగా నమోదైందని వ్యవసాయశాఖ అధికారిణి శ్రీలత పేర్కొన్నారు. రైతులు పంటలు వేసుకోవడానికి వీలుగా వర్షం పడటం హర్షణీయమన్నారు.